క్లుప్తంగా

పలువురికి ఉగాది పురస్కారాలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని పలువురు ఉగాది పురస్కారాలు (నంది) అవార్డులు అందుకున్నారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, విద్యావేత్త ప్రొఫెసర్ అయ్యగారి శ్రీనగేష్, చవ్వాకుల నరేష్‌లకు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఉగాది నంది పురస్కారాన్ని అందించారని రంగసాయి తెలిపారు. గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, కళారత్న ప్రభుత్వ అవార్డు గ్రహీత కత్తిమండ ప్రభాకర్, అద్దంకి రాజా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

భీమవరం: ఫెర్టిలైజర్స్ డీలర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక శుక్రవారం భీమవరంలో చాంబర్ ఆఫ్ కామర్స్‌లో నిర్వహించారు. గాదిరాజు విశ్వనాథరాజు అధ్యక్షతన 2025–27 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బొండా వెంకట సత్య శ్రీరామ హనుమంతరావు, ఉపాధ్యక్షుడిగా చవ్వా శ్రీనివాస సుబ్బారావు, కార్యదర్శిగా కూర్మదాసు సత్యశ్రీనివాస్ (వాసు), సహాయ కార్యదర్శిగా మీసాల భాస్కరరావు, కోశాధికారిగా సోము శేషారావు ఎన్నికయ్యారు.

ఘనంగా అన్నసమారాధన



తాడేరులో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు గ్రామంలో శుక్రవారం పుంతలో ముసలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఘనంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా పలు రకాల వంటకాలను తయారు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నంబుల మణికృష్ణ, ఓడుపు సురేష్, శివ, తోట చంటి, సిరిగినీడి సాయి, మాదాసు బాబ్జి, కర్రి మణి, తోట నాని, సిరిగినీడి గోపికృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

కానిస్టేబుల్ మృతిపై కేసు నమోదు



మృతి చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సీహెచ్ వెంకటేశ్వరరావు (37) ఆకస్మికంగా మృతి చెందారు. ప్రస్తుతం ఆకివీడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణం వలన స్వగ్రామమైన శృంగవృక్షంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం అర్ధ రాత్రి కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో బాత్రూంలోకి వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో వెంటనే ఆయన భార్య వెళ్లి చూడగా స్పృహ తప్పి ఉండడంతో దగ్గరలో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడికి చూపించగా ఆయన మృతి చెందినట్లు తెలిపారు. తదనంతరం మృతుడి భార్య కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎస్సై మంతెన రవివర్మ అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

భీమవరం: పగడాల ప్రవీణ్ ఆకస్మిక మృతిపై సమగ్ర విచారణ చేసి, న్యాయం చేయాలని భీమవరం పరిధిలోని పలు క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులపై చేస్తున్న అరాచకాలపై ప్రభుత్వ అధికారులు, పోలీస్ యంత్రాంగం స్పందించి వారికి న్యాయం చేయాలని, వారి మనోభావాలను కాపాడాలని కోరారు. ఎఫ్ఎప్‌సీఐ, యూపీఏ, యూపీఎఫ్, ఐపీఏ తదితర సంఘస్తులు పాల్గొన్నారు.

కోకోనట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కఠారి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కోకోనట్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కఠారి నాగేంద్రకుమార్ గెలుపొందారు. శుక్రవారం అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నాగేంద్ర కుమార్ 29 ఓట్ల మెజార్టీతో యినకొండ రంగారావుపై, ద్వితీయ ఉపాధ్యక్షుడిగా కుందూరు వెంకట్రామయ్య 8 ఓట్లతో వీరగుమ్మల వెంకటకృష్ణపై విజయం సాధించారు. సెక్రటరీ మాటూరి సోమేశ్వర వెంకట రామకుమార్, ట్రెజరర్ దేవరపు శ్రీనివాస్, ప్రథమ ఉపాధ్యక్షుడు చివటపు నాగేశ్వరరావు, తృతీయ ఉపాధ్యక్షులు లంకలపల్లి నాగ వెంకట సత్య రమేష్, సహాయ కార్యదర్శి కొండేటి శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిధులు ఫుల్.. అభివృద్ధి నిల్

- అధ్వాన్నంగా రోడ్లు, డ్రెయిన్లు
- రూ.4.90 కోట్ల నిధులు మంజూరైనా పనులు శూన్యం
- పట్టణంలో మల్టీప్లెక్స్ వద్ద ప్రమాదకరంగా గుంతలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



తారు నిర్మాణం లేక రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉన్న పైపుల చెరువు రోడ్డు



పట్టణంలో మల్టీప్లెక్స్ వద్ద భారీ గుంతలు ఏర్పడిన పీపీ రోడ్డు



నిధులు మంజూరైనా అభివృద్ధికి నోచుకోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద డ్రెయిన్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రమైన భీమవరం మున్సిపాలిటీలో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ పట్టణంలో అభివృద్ధి పనులు జగరడం లేదు. పట్టణంలో పలుచోట్ల రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. వాటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం చేపట్టడం లేదు. నిర్మాణాలు చేపట్టాల్సిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. మరో రెండు నెలల్లో వర్షకాలం రానుంది. ప్రస్తుతం అభివృద్ధి పనులకు వాతావరణం అనుకూలంగా ఉంది. ఈ సమయంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేయకపోతే వర్షకాలం పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడక తప్పదు.

రూ.4.90 కోట్ల నిధుల మంజూరు

పట్టణంలో పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులకు రూ.4.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పీపీ రోడ్డు నుంచి డీఎన్ఆర్ కళాశాల రోడ్డుకు సంబంధించి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, కుముదవల్లి రోడ్డులో సీసీ రోడ్డుకు రూ.2 కోట్లు అలాగే పీపీ రోడ్డులో ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద డ్రెయిన్ నిర్మాణానికి రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చేపట్టడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు.

పీపీ రోడ్డుపై భారీ గుంతలు

భీమవరం మల్టిప్లెక్స్ వద్ద పీపీ రోడ్డు భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. నాణ్యత లేని మరమ్మతుల కారణంగా ఈ గుంతలు ఏర్పడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు లేని రహదారుల నిర్మాణం అంటూ ప్రభుత్వం చేపట్టిన మరమ్మతులలో నాణ్యత లోపానికి ఈ గుంతలు సాక్ష్యంగా నిలిచాయి. వేగంగా వస్తున్న వాహనాలు ఈ గుంతల వలన సడన్ బ్రేకులు వేయడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే అధికారులు గానీ, ఆర్అండ్‌బీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతతో కూడిన మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రాళ్లు లేచిన రహదారి

విస్సాకోడేరు లేఅవుట్ పైపుల చెరువు రోడ్డు బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయగా సదరు కాంట్రాక్టర్ పలుమార్లు రోడ్డుపై గ్రావెల్ వేయడం తరువాత తారు వేయకుండా నెలల తరబడి వదలి వేశారు. ఏడాది నుంచి ఇదే తంతు నడిచింది. ఇటీవల మళ్లీ గ్రావెల్ వేసి తారు వేయకుండా వదలి వేశారు. దీంతో వాహనాలు వెళ్లే సమయంలో రాళ్లు లేచి ప్రయాణికులకు, స్థానిక ఇళ్ల వారికి తగులుతున్నాయి. ఇక పైకి లేచే దుమ్ముతో కళ్లు పూడిపోతున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు మంచినీటి పైపు లైన్లు ఈ రోడ్డులో ఉన్నాయి. భారీ లోడు వాహనాలు రాకపోకలు సాగించడంతో ఈ పైపు లైన్లకు ముప్పు ఉంది. రోడ్డుకు రెండు వైపులా భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా చర్యలను తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌పై ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో శరవేగంగా అభివృద్ధి పనులు

గత ప్రభుత్వంలో భీమవరం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శర వేగంగా నిర్వహించారు. ఐదేళ్ల కాలంలో రూ.130 కోట్ల పనులు చేశారు. మొదటి ఏడాదిలో రూ.40 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. పది నెలల కాలంలో పట్టణంలో కనీసం రూ.5 కోట్ల పనులు చేయలేకపోయారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

ఆకివీడు: స్థానిక మాదివాడలోని పురాతన దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శుక్రవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద హోమం, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం సాయి దత్త నాగానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం, బూర్లు పోసే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు కల్యాణంలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోరాటాలకు మద్దతిస్తా

ఎమ్మెల్సీ గోపిమూర్తి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గోపి మూర్తి

కాళ్ల: భవిష్యత్తులో ఉపాధ్యాయుల సమస్యలపై మండలిలో తన గళం వినిపిస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి శుక్రవారం తెలిపారు. మండలంలోని కాళ్ల, దొడ్డనపూడి, జువ్వలపాలెం, ఏలూరుపాడు, కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూళ్లను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయుల చేసే పోరాటాలకు తన మద్దతిస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.రామకృష్ణంరాజు, ఎం.శంకర్రావు, పీవీ రామరాజు, పి.ప్రభుదాసు, ఎస్వీ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీపై 'కూటమి' చిన్నచూపు



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులతో నాయకులు

పాలకోడేరు: మండలంలోని మోగల్లులో గత ప్రభుత్వం జగనన్న కాలనీ పేరిట పేద ప్రజలకు ఇంటి స్థలాలను ఇచ్చి, కాలనీని ఏర్పాటు చేసింది. అయితే ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీపై చిన్నచూపుతో వ్యవహరిస్తుంది. వివరాల్లోకి వెళితే.. డ్రెయినేజీ వ్యవస్థ లేక ముంపునకు గురవడంతో ఆ కాలనీవాసులు పడుతున్న అవస్థలను శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జగనన్న కాలనీని పరిశీలించేందుకు జిల్లా కమిటీ వచ్చింది. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి మండల తహసీల్దార్‌కు ఫోన్ చేయగా నా పరిధి కాదని ఎంపీడీవోకి ఫోన్ చేయమని నిర్లక్ష్యపు సమాధానం చెప్పారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్వా వ్యర్థాల వలన జ్వరాలు, వాంతులు వంటి అనారోగ్యాలతో పిల్లలు బాధపడుతున్నారని, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వలన కాలనీ తరుచూ ముంపుకు గురవుతున్నా వాటిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. ఈ కాలనీ చుట్టూ అనధికార ఆక్వా చెరువులు సాగు వలనే కాలనీ ముంపుకు గురవుతుందన్నారు. ముంపు గురించి తెలిసిన కలెక్టర్ వెంటనే ఎమ్మార్వోకి ఆదేశాలు జారీ చేసినా వాటిని పక్కన పెట్టడం అన్యాయమన్నారు. ఇంటి నిర్మాణం చేసుకునే వారి మెటీరియల్ ఇసుక, కంకర, ఐరన్ అంతా పాడై పోతుందన్నారు. వాటికి నష్టం అధికారులే ఇవ్వాలన్నారు. లక్షల రూపాయలు మెటీరియల్‌ను పేద ప్రజలు నష్ట పోతున్నారన్నారు. స్కూలుకు వెళ్లే విద్యార్థులు నడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లామని, వెంటనే తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గోపాలన్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, గ్రామ కార్యదర్శి పాల వెంకటస్వామి, నాయకులు వీరవల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల బాబురావు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

భీమవరం అర్బన్: రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సేకరించిన రక్తం ఎంతో మంది జీవితాలను కాపాడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ నాగేశ్వరరావు అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో శుక్రవారం గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం చేసి మరో ప్రాణాన్ని కాడాలన్నారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ శివ రామభద్రిరాజు మాట్లాడుతూ రాయలంలో ఏర్పాటు చేసి రెడ్ క్రాస్ బ్లడ్ సొసైటీ సంస్థ నూతన భవనంలో అత్యంత ఆధునికమైన పరికరాలతో నిర్వహిస్తున్నామని ఇది జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రక్తం కావాల్సిన వారు వేరొక దాతను తీసుకురాకుండానే డాక్టర్ ప్రిస్కిప్షన్‌తో నేరుగా బ్లడ్ బ్యాంకుకు వచ్చి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రక్తాన్ని తీసుకెళ్లొచ్చన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి ఎక్కువ మంది రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాసరావు, జేఈ ఎం.కనకారావు, రెడ్‌క్రాస్ సొసైటీ కో–ఆర్డినేటర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

పెనుగొండ: వడలిలో బెరాకా బ్లెస్సింగ్ నవజీవన సహవాస సమాజం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి బుద్ధుడు హస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



ధ్వజ స్తంభం ప్రతిష్ఠిస్తున్న పండితులు, భక్తులు

భీమవరం అర్బన్: మండలంలోని దెయ్యాలతిప్పలో శుక్రవారం సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో శ్రీరామాలయ ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. రుత్వికులు బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతి శర్మ ఆధ్వర్యంలో పది మంది వేదపండితుల మంత్రోచ్ఛరణలతో, హోమాలతో శ్రీకోదండరాముల స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పొన్నమండ నారాయణ దంపతులు కలశ పూజలు చేశారు. ఆలయ అర్చక స్వామి బొమ్మిడి గణపతి, గ్రామ పెద్దలు, సర్పంచ్ తిరుమాని శ్రీను, ఎంపీటీసీ రామాని నరసింహస్వామి, తిరుమాని వెంకటేశ్వర్లు, మోకా గంగరాజు, బొమ్మిడి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బొమ్మిడి బాబు రాజేంద్రప్రసాద్ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

భీమవరం: లౌకికవాద, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఎన్‌డీఏ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును రూపొందించిందని ముస్లిం కమిటీ ప్రతినిధులు తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వీరికి సీపీఎం నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో షేక్ రబ్బాని, ఎంఏ నౌషద్, ఎండీ పర్వాన్, ఎండీ అఫ్జల్ పాషా, ఎండీ కరీముల్లా, జె గోపాలన్, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

మధ్యస్థలంకలో క్షేత్ర దినోత్సవం

పెనుగొండ: ఉండి కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామం సిద్ధాంతం మధ్యస్థలంకలో శుక్రవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 35 ఎకరాల్లో శారద రకం నువ్వులను సాగు చేయడానికి విత్తనాలు పంపిణీ చేశారు. ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, 54 శాతం నూనే కలిగి ఉండి 85 నుంచి 90 రోజులకు కోతకు వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. శాస్త్రవేత్తలు ఎస్ మల్లి కార్జునరావు, ఎ.శ్రీనివాసరావు, పి.వినయలక్ష్మి, వ్యవసాయాధికారి పి.స్పందన, కె.చందు, కార్తీక్ రెడ్డి, సీహెచ్ గనిరాజు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేపట్టాలి



ఎగ్జిబిషన్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భీమవరం: పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేపడితే భవిష్యత్తులో సొసైటీకి ఉపయోగంతో పాటు విద్యార్థుల ఉన్నతికి దోహదపడతాయని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు పేర్కొన్నారు. కళాశాల ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో క్రక్స్ 2కే25 పేరిట హార్డ్‌వేర్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోలార్ సిస్టం, రోబోట్, సాయిల్ టెస్టింగ్‌తో పాటు ఎన్నో వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టులకు నూతన టెక్నాలజీని జోడిస్తే విద్యార్థులు స్టార్టప్ పెట్టే స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. సుమారు 50 ప్రాజెక్టులకు గాను 200 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

భీమవరం: డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, వారి విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) 17వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు తెలిపారు. కార్యక్రమానికి అతిథులుగా యమహా మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ పీఎస్ గణేశన్, అనలాగ్ డివైసెస్ ఇంజనీరింగ్ మేనేజర్ జి.నాగార్జున, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆధునాతన పద్ధతులతో విద్యనభ్యసించి, నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు, మెడల్స్ షీల్డు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.శ్రీలక్ష్మి, పలు విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలపై దృష్టి

పెనుగొండ: చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల వినియోగంపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం వడలిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. తడి, పొడి చెత్త సేకరణ, ఘన పదార్థాల నిర్వహణ, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీ రెడ్డి గణేశ్వరరావు, డీపీఆర్‌సీ టీం లీడరు ఎడ్వర్డు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ

యలమంచిలి: అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషకాహార కిట్‌లు బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యానికి ఉపకరిస్తాయని సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర అన్నారు. గ్రామ ఆరోగ్య పోషణ దినం (వీహెచ్ఎన్‌డీ) సందర్భంగా శుక్రవారం శిరగాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోఆమె పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్‌లో పోషకాహారాన్ని వృథా చేయకుండా భుజించాలని సూచించారు. అనంతరం గ్రామ స్థాయి బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామరాజు



సామంతపూడి శ్రీరామరాజు



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాలకొల్లుకు చెందిన సామంతపూడి శ్రీరామరాజు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం భీమవరం రైస్ మిల్లర్ల అసోసియేషన్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా చవ్వాకుల నరసింహరావు (భీమవరం), కొత్తపల్లి సూర్యనారాయణ (అత్తిలి), కార్యదర్శిగా కొత్త వెంకట శ్రీరామనారాయణ (శ్రీనివాస్, ఆకివీడు), సహాయ కార్యదర్శులుగా పేరూరి వీఎస్ఎన్ రాధాకృష్ణ (ఆకివీడు), అనంతపల్లి ఫణీంద్ర రామ వెంకట సుబ్బారావు (మొగల్తూరు), కోశాధికారి పెరుమాళ్ల వెంకట శ్రీహరినాథ్ (గణపవరం)లను ఎన్నుకున్నట్టు అసోసియేషన్ సభ్యులు పోలిశెట్టి దాసు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారని పేర్కొన్నారు.